



కామేశ్వరమ్మ జీవితం యిక కొద్దిఘడియలు మాత్రమేనని డాక్టర్లు తేల్చారు. ఆమె అనుభవించే విపరీతమైన బాధను అదుపులో పెట్టేందుకు విద్రకు యింజక్షన్ యిచ్చారు. గదిలో ఆమె మంచం చుట్టూ, భర్త భాస్కరరావు మొగపిల్లలు ముగ్గురు, యిద్దరాడపిల్లలు, కోడళ్ళు గుమిగూడివున్నారు. ఇంజక్షన్ ప్రభావం తగ్గి ఆమెకు మెళకువ వచ్చే టైము యింది. మరల యింజక్షన్ సిద్ధంచేసి వుంచుకున్నాడు పెద్దకొడుకు డాక్టర్ మురళి. కామేశ్వరమ్మ మెల్లగా కళ్ళువిప్పి, తన చుట్టూవున్న వారిని క్రమంగా పోల్చుకున్నది. తెలివితోపాటు బాధకూడా బైటపడగానే "అమ్మా!" అంది మెలికలు తిరుగుతూ. మురళి యింజక్షన్ చేతపట్టి ఆమెవద్దకు వచ్చాడు.

"మురళీ! బాధ భరించలేనిదే అయినా ఈ ఆఖరి ఘడియల్లో, మనస్సు విప్పి మాట్లాడ నియ్యరా" అంటూ వారించింది. గది అంతా ఒక్కసారి కలయజూచింది. చుట్టాలుకూడా చాలా మంది వున్నారక్కడ. భర్త, పిల్లలు, కోడళ్ళుతప్ప మిగతావాళ్ళను గది వదిలి వెళ్ళమని చెప్పిందామె. అంతా సర్దుకున్నాక మరల అందరి ముఖాలు ఒక్కసారి చూచి "అట్లా ముఖాలు వేళ్ళాడేసి, లేని దుఃఖం నటిస్తారెందుకు మీరంతా? హమ్మయ్య! ఈ రాక్షసిపీడ యిక వదలిపోతూందని, మీ మనస్సులు తేలిక పడటం నాకు తెలియదనుకున్నారా?" అంది.

"కామూ! ఏమిటా మాటలు" అన్నారు భాస్కరరావుగారు.

"మా దంత రాతిగుండె కాదమ్మా" అన్నారు పిల్లలు, ఏక కంఠంతో.

అంత బాధలోనూ, చిరునవ్వు నవ్వారామె.

మృత్యువు సన్నిధిలో కూడా, అబద్ధం చెప్పే పిరికివాళ్ళు కాకూడదు, నా వాళ్లు. మీ మనస్సులు, భావాలు. పుస్తకం చదివినట్లు చదవగలను నేను, మీరంతా నిజంగా నా చావు గురించి విచారిస్తున్నారా?" అంటూ భర్త కళ్ళల్లోకి గుచ్చి చూచింది కామేశ్వరమ్మ. ఆయన తల వంచుకున్నారు. పిల్లలు కోడళ్లు. ఆమె నిశిత దృష్టి నెదుర్కోలేక, కళ్ళు వాల్చేశారు.

"నాకు తెలుసు. మీ ఆలోచనలు" అన్నారామె బాధగా కళ్ళు మూసుకుంటూ. గదిలో నిశ్శబ్దం రాజ్యం చేసింది కొన్ని క్షణాలు. తాము పట్టుబడి పోయామనే భావం, ఆఖరి క్షణంలో కూడా, ఆమె ముందు ఓడిపోయామనే సిగ్గు, వాళ్ళ ముఖాల్లో ప్రతిఫలించాయి, కామేశ్వరమ్మ బాధను మర్చిపోయింది. ఆమె ముఖంలో, నిరాశ అపజయం తాండవించాయి. పది నిముషాలు, పది యుగాలుగా గడిచాయి. కామేశ్వరమ్మ ముఖం, రోషంతో ఆవేశంతో నిండిపోయింది. ఆమె కళ్ళు తెరిచి విసురుగా "అవును నేను రాక్షసినే! అదే నాకు, చేసుకున్న భర్త, కన్న పిల్లలు, వచ్చిన కోడళ్లు, చుట్టాలు, వూరు, వాడా పెట్టిన పేరు! నా వాళ్ళయినా, నన్నర్థం చేసుకుంటారని పొరపాటుపడ్డాను. ఇక ఈ రాక్షసి ఆయువు తీరిపోయింది. మీరంతా సుఖంగా బ్రతకండి' అన్నారామె కన్నీరు కారుస్తూ.

ఒక్కరినోటివెంటా మాటరాలేదు! ఒక్కరూ ఆమెను ఓదార్చ సాహసించలేదు. భర్త భాస్కరరావును చూచి ఆమె నెమ్మదిగా.

"నేను పదిహేనేండ్లు నిండని పసివయసులో మీ జీవితంలో ప్రవేశించి, ముప్పదేండ్ల కాపురం చేశాను, అప్పుడు ఆదర్శము, ఆశయములేని, మామూలు మనిషిమీరు. స్కూల్‌ఫైనల్, రెండు దండయాత్రల తరువాత. ఎట్లాగో గట్టెక్కించి మీ వంశపారంపర్యంగా. వస్తున్న ఎలిమెంటరీ స్కూలు మాష్టరీ జీవితాన్ని. వరించాలన్నదే మీ ఆశయం, మీ వారందరి అభిలాష. నేడు మీరు సంఘంలో. గౌరవంగల, గవర్నమెంటు గెజిటెడ్ ఆఫీసర్; గ్రాడ్యుయేట్. ఇది ఎట్లా సాధ్యమైందో మీ రెవ్వరైనా ఆలోచించారా, కాపురానికొచ్చిన కొత్తలో మిమ్ములను, యితర

వుద్యోగాల పరీక్షలకు కట్టమని, ఎదుగుబొదుగు లేని మేష్టరియే. మీ ఆశయం కాకూడదని, ప్రోత్సహించాను. మీలో చలనం కలగలేదు. ఇక మార్గంలేక మీరెందుకు పనికిరారని, దద్దమ్మని సాధించటం మొదలెట్టాను. అందరూ గయ్యాళని నన్నాడిపోసుకున్నా. దాంతో మీలోని అహం దెబ్బతింది. పట్టుదలతో పరీక్షలు ప్యాసై యింతవారయ్యారు. సుఖజీవన సంప్రదాయం. విచ్చలవిడిగా ఖర్చుపెట్టటం. మీకు సంక్రమించిన, పిత్రార్జితాలు, కాస్త పైకిరాగానే, మీ స్వభావం విజృంభించ నారంభించింది. అది అదుపులోపెట్టి, కుటుంబాన్ని పైకి తీసుకురావాలనే కోర్కెతో, అడుగడుగున మిమ్మల్ని ఆదరిస్తూ. మీ మనస్సులో రాక్షసిగా ముద్ర పడ్డాను. మీ సుఖజీవనతత్వం, మిమ్ములను క్లబ్బులకు, చీట్లాటకు, బారుకు బానిసగా మార్చి, అది మన పిల్లలకు ఆదర్శమవుతుందనే భయంతో అందరి ఖర్చులకు కళ్ళాలు బిగించి, చెడ్డదాన్నయ్యాను. కాని మీరెప్పుడైనా ఆలోచించారా, మీ అందరికీ నేనేమైనా లోటు చేశానాఅని? రాత్రింబగళ్ళు, మీకు మీ పిల్లలకు, సకల సుఖాలు కూర్చటానికి, దాసీదానికన్నా, ఎక్కువగా కష్టపడి, నా ఆరోగ్యం పోగొట్టుకున్నాను. డబ్బు కానీ చొప్పున కూడబెట్టి ఆదా చేశాను. నా జీవితంలో యిరవై రూపాయల నేతచీరతప్ప కట్టుకోలేదని మీకు తెలియదా? అడ్డదారుల్లో అక్రమ సంపాదన వద్దని, అడ్డు పెట్టినా, మీ కష్టార్జితంలోంచి కూడబెట్టి కట్టినదేకదా ఈ యిల్లు, రాక్షసిలా మిమ్ములనందరిని పీడించి ప్రతి రూపాయి ఖర్చుకు ఆరాతీసి, ఆదాచేసిన డబ్బును నేను నాతో పట్టుకుపోవటంలేదు. దానిని, నా సుఖానికి ఖర్చు పెట్టలేదు. కాని, కానీ చొప్పున మూటకట్టి బ్యాంకులో వేసింది యాభై వేలుంది. ఇకతండ్రీ కొడుకులు దర్జాగా దూబరా చెయ్యండి, ఆడపిల్లలిద్దరికీ చెరో ఐదువేలు యివ్వమని నా కోర్కె."


"ఏరా మురళీ! నాటకాల రాయుడుగా నటన బోంచేస్తూ బ్రతుకు వెళ్ళదియ్యాలని వుబలాటపడిన నిన్ను డాక్టరుగా తీర్చి దిద్దాననే కదా కోపం. నీకు నా మీద."

"ఆంధ్ర పెర్రీమేసన్! శంకర్. నీ అభిమాన పుస్తకాలు "అర్ధరాత్రి హత్య" "నడిచే శవం" వగైరా తగలబెట్టి లెంపలు వాయించి, చదివించి, యింజనీరును చేశాననేకదూ నీకు నా మీద అసహ్యం?"

"నా చిన్నారి రవి! నీకు కూడా నామీద కంతందాకావుంది కదయ్యా! చదువుకు ఎగనామంపెట్టి, నీవు కథలు గిలికే కాగితాలు లాక్కుని, బావగొట్టి, చెవులుమూసి, ముందు చదువు పూర్తిచేసి, జీవితంలో స్థిరపడమన్నానని కదూ? నేడు నీవొక కాలేజీ లెక్చరరవు. ప్రసిద్ధ రచయితవు. నీకు కూడా నా తత్వం అర్థం కాలేదనేదే నాబాధ."

"రమా! ఎర్రగా, బుర్రగావున్న కారేజీ కుర్రాడికి మనసిచ్చానంటూ, వికసించని మొగ్గలాంటి జీవితాన్ని, చిదుపుకోవాలని, చిందులు త్రొక్కిన, నిన్ను అదుపులోపెట్టి కాలేజీ చదువు పూర్తి చేయించాను కదూ? నీవు మనసు పడిన. కుర్రాడు ముగ్గురు. ఆడపిల్లలను, మోసంచేసినా. నేను నిన్నొక డాక్టరుకిచ్చి పెండ్లి చేసి, నీ సంసారాన్ని సుఖమయం చేసినా నీవు నన్నింకా క్షమించలేదు కదూ?"

"రాణీ! నా పిచ్చితల్లీ! సినిమాలో చేరాలనే నీ పిచ్చిని చీపురు దెబ్బలతో వదలగొట్టి, కట్టు దిట్టంతో కాలేజీ చదువు పూర్తి చేయించి, లెక్చరర్‌గా, స్థిరపడిన నీకు, నీవు మనసిచ్చిన వానిని, పెండ్లి చేసినా, నీ గాయంమాని, నామీద కసితీరలేదా?"



ఉపాయనం

చిత్రం: జె. ప్రభుదాస్, కడప

"అమ్మాయీ శారదా! అంద చందా లొట్టే లేకపోయినా కట్నం కానుకల కాసించక, బంధు ప్రేమతో నిన్ను మా పెద్దాడికి చేసుకున్నాను. నీవువస్తూ మూర్ఖత్వాన్ని పెంకెతనాన్ని సారెగా తెచ్చుకున్నావు నీ దృష్టిలో అత్తొక పిశాచం! నీవు ఏడ్చినా మొత్తుకున్నా, నన్ను నలుగురిలో నానా అల్లరి చేసినా, నీ ఆటలు సాగనియ్యక అదుపాజ్ఞలలో పెట్టి, భర్తను, పిల్లలను తీర్చి దిద్దుకునే, నేర్పరిగా తయారు చెయ్యటమేగా, నా తప్పు!"

"చదువుల సరస్వతీ లలితా! నీవు M. A పాసయ్యావు నా రెండో కోడలుగా వచ్చేటప్పటికి, వంట, వార్పు, పనీ ఒంటికి పడవు. క్లబ్బులు, సినిమాలు, సరదాలు కావాలి నీకు. అవి సాగనియ్యక, అన్నీ పనులూ నేర్పి, చేయించి సంసారం సుఖమయం చేసుకున్నాకనే మిగతా సరదాలని నిన్ను మిగతా కోడళ్ళతో సమానంగా చూశానని కదూ నీ ఫిర్యాదు!"

"లీలా! నీవు నీ తండ్రికి ఒక్కర్తెవే సంతానం, రవికి మీ వూళ్లో వుద్యోగం వేయించి, మీ యింట్లో వుంచుకోవాలనే అభిలాషను సాగనియ్య లేదనే కదూ నీ ఆవేదన! ఆడది అత్తింటనే రాణిస్తుందని, యిల్లరికం, మగవాని పౌరుషానికి అడ్డు అని ఆంక్ష పెట్టానని కదూ!

"నాకు ఒకందుకు మాత్రం సంతోషంగా వుంది. తోడి కోడళ్ళ పొత్తు లోక ప్రసిద్ధం. వారిలో పరస్పర విద్వేషాలు, అసూయ, సామాన్యం. నన్ను సాధించాలని, మీరంతా కలిసి కట్టుగా నడుం కట్టటం సంతోషం కాదామరి!"

"ఒరే మురళీ! కడుపులో బాధను పళ్ల బిగబట్టి భరించకలనురా, నా చావు కోరుతూ, భర్త, పిల్లలు, కోడళ్లూ, చుట్టూ క్షణాలు లెక్కపెడుతుంటె నా రక్తంలోని అణువణువు, భగ్గున మండి పోతోందిరా! అది భరించలేను. ఇయ్యరా మత్తు యింజక్షన్. మనస్సు మొద్దుబారితే ప్రశాంతంగా ప్రాణం విడుస్తాను! అంది కామేశ్వరమ్మ. 'అమ్మా' అంటూ వెను దీశాడు. మురళి యింజక్షన్ యివ్వటానికి.

"ఒరే నేను రాక్షసినిరా! ఇంతవరకు నా మాటకు తిరుగులేదీ యింట్లో. ఇప్పుడు కాదనటానికి నీకెన్నిగుండెలు, ఇయ్యరా యింజక్షన్" అంటూ ఆజ్ఞాపించారు కామేశ్వరమ్మ. మురళి యిచ్చిన ఇంజక్షన్‌తో మగతలోకి జారారామె. అందరూ బైటకువచ్చి కుర్చీలలోకూలబడి ఎవరి ఆలోచనలలో వారు లీనమయ్యారు.

భాస్కరరావు:—

తను నిజంగా కామూను ద్వేషిస్తున్నాడా? ఆమెచేసిన నేరం ఏమిటి? మరి తానామె కళ్ళలోకి సూటిగా ఎందుకు చూడలేక పోయాడు? తమదొక సనాతన ఛాందసవంశం. తమ సంసారంలో స్త్రీ కొక వ్యక్తిత్వంలేదు. ఆమె ఆలోచనకు సలహాకు విలువలేదు. ఆమె స్థానం వండి పెటటం, పిల్లల్నికనటంవరకే పరిమితం. తాత ముత్తాతలనుండి తమ వృత్తి ఎలిమెంటరీస్కూలు మేష్టరుగిరీ. తమ గ్రామంలోను, ప్రక్క పల్లెలోనూవున్న ఎయిడెడ్ స్కూళ్ళ యాజమాన్యం తమ వంశానిది. మగపిల్లలందరికీ మాష్టరుగిరియే ధ్యేయంగా ఎంచేవారు. 6వ తరగతి చదువు చాలని తరువాత ట్రైనింగై మేష్టరుగా స్థిరపడే వారు. తనకు అంతకుమించి ఆశయం వుండేది కాదు. అందుకే ఆడుతూ, పాడుతూ, అప్పుడప్పుడు తప్పుతూ, ఎట్లాగో స్కూల్ ఫైనల్ గట్టెక్కించాడు తను. పద్దెనిమిదేండ్లు నిండేటప్పటికి సాంప్రదాయమైన వంశమంటూ కామేశ్వరినిచ్చి పెండ్లి చేశారు తనకు. ఏడవమాసం నిండ

# రాక్షసి


కుండానే. పీలగా ఫుట్టినతనను అర్భకం వెధవని ఏపని చేయనీక పెంచారు. ఫలితంగా సన్నంగా పూపరిలేనట్టుండేవాడు తను. కామేశ్వరి బొద్దుగా ఆరోగ్యంగా చామనచాయైనా కళగావుండేది. ఆమె ఆరోగ్యం, తనకు అసూయకలిగించేది తనను. "యింత బక్కతనం, సుకుమారమేమిటి బాబూ" అని వేళాకోళం చేసేది. కాపురానికొచ్చిన కొద్ది రోజులకే "ఆరోగ్యముంటేనే జీవితంలో ఆనందం. వ్యాయామం చెయ్యమని పోరసాగింది ! తను వినలేదు. క్రమంగా "ఈ బక్క మనిషితో సంసారమా" అని ఈసడించేది. తనకు పౌరుషం వచ్చి వ్యాయామంతో శరీరాన్ని గట్టిపర్చుకున్నాడు. మేష్టరు ట్రైనింగ్‌కు వెళ్ళాలని ప్రయత్నంలో వున్న తనతో కామేశ్వరి.

"బతకలేక బడి పంతులన్నారు ! గొర్రెతోక లాంటి జీతంతో. పిల్లా జెల్లా కలిగాక అర్థాకలితో అంతా మాడవలసివస్తుంది. సర్వీస్ కమిషన్ పరీక్షకు కట్టండి" అంటూ సతాయించటం సాగించింది.

"స్కూల్ మేష్టరీ సుఖమైన వుద్యోగం, కడుపులో చల్ల కదలకుండా, పుణ్యం పురుషార్థం సంపాదించవచ్చు. మా తాత తండ్రుల దారినే నేను పోతాను" అని చెప్పాను.

"మీ తాతకు ముప్ఫై యెకరాలుండేది. మీ నాన్నగారికి ఐదెకరాలైనా వచ్చింది. కనుక వాళ్ళ జీతంమీదే, ఆధారపడకుండా, జీవితాలు సుఖంగా వెళ్ళదీశారు. మీ దగ్గర కొచ్చేటప్పటికి యెకరమైనా మిగుల్తుందనే ఆశలేదు. ముందు ముందు, మనం పిల్లా పాపలతో అర్థాకలితో అల్లల్లాడాలి దీనినే పట్టుకుని కూర్చుంటే" అన్నది కామేశ్వరి.

"నారు పోసినవాడు నీరు పోయడా ! అంతా ఆ భగవంతునిదే భారం మన చేతిలో ఏముంది" అన్నాను, జీర్ణించుకున్న వేదాంతంతో.




"మెట్ట వేదాంతంతో మనస్సును, మభ్యపెట్టుకోవటం, జీవితాన్నెదుర్కోలేని, పిరికి వాళ్ళ, అసమర్థుల, లక్షణం, సంసార క్షేత్రంలో నారు పోసేది మీరు. నీటివసతి కూడా మీరే ఆలోచించాలి, భగవంతుడు నదులలో సమృద్ధిగా సమకూర్చిన నీటిని, పొలాలదాకా తెచ్చి పండించే రైతులా ! వెనకాల ఆధారముంటే స్కూలు మేష్టరీ ఫరవాలేదు. చూడండి పొరుగింటి శాస్త్రిగారి సంసారం, పదిమంది పిల్లలతో మేష్టరుగా పడేబాధలు . చిరిగిన పరికిణీలతో, సరియైన పోషణలేక చిక్కిన శరీరాలతో, శేరు బియ్యానికి దీనత్వం నిండిన కళ్ళతో, దేబిరిస్తూ వచ్చేవాళ్ళ పిల్లలను చూస్తే కడుపు తరుక్కుపోతుంది ! మీరు మేష్టరీలో మగ్గిపోతే మన పిల్లలుకూడా ఆ అవతారాలెత్తాలి కాబోలు భగవంతుడా అని నా మనస్సు మండిపోతోంది. నా మాటవిని పరీక్షకు కట్టండి" అంటూ చెవి కట్టుకుని పోరేది కామేశ్వరి. "ఆ వెధవ పరీక్షలను ఎవడు చదువుతాడు ? సుఖంగా మేష్టరీ చేస్తాను" అంటూ మొండికేశాను.

"అట్లా పెద్దకబుర్లు చెప్పకపోతే నాకు తెలివితేటలులేవు. చాతకాదని చెప్పకూడదూ" అంది కామేశ్వరి. తనలో ఆవేశం కట్టలు తెంచుకుంది "నన్ను చాతకానివాడంటావా" అంటూ చెయ్యి చేసుకున్నాను.

"అవును చాతకానితనమే ! ఆడదాన్నికొట్టి నోరుమూయించాలని చూట్టం గొప్పకాదు ! చావవుంటే పరీక్షల్లో నెగ్గి మీ సామర్థ్యం, నిరూపించుకోండి" అంటూ సవాలు చేసింది కామేశ్వరి చెంప తడుముకుంటూ. పసితనం పూర్తిగా ఒదలని తనుఅమ్మవద్ద ఫిర్యాదుచేశాడు. "తన్ను అసమర్థుడంటూందని" మా అమ్మ భద్రకాళి అయింది. "ఏమే నీవువచ్చి ఆరు మాసాలు కాలేదు. మగవాడిని ఆరడి పెట్టటం ఈ యింట్లోలేదు. చచ్చినట్టు పడుండాల్సిందే ఆడది ! మీ మామగారు చెయ్యటంలేదేమేష్టరుపని, దాని కేమొచ్చిందని వాణ్ణి రాచి రంపాన పెడుతున్నావు." అంటూ లేచింది. కామేశ్వరా వూరుకునేది !

"అత్తయ్యా ! మీకు మీ మామగారు ఐదెకరాలిచ్చారు కనుక గుట్టుగా వెళ్ళింది, సంసారం, మామగారు మేష్టర్ చేసినా. మీరు మాకొకయకరం మిగల్చగలరేమో. మేష్టర్ జీతంతో, ముందు, ముందు పడబోయేబాధ భగవంతుడికే తెలియాలి. నేనేమంత, తప్పుమాటన్నానని, అంతరాద్ధాంతం చేస్తారు ! పరీక్షకు కట్టమంటే తప్పా" అంటూ మాటకు మాట అంటించింది.

"అయ్యో ఖర్మ ! ఇట్లాంటి రాక్షసిని కట్టబెట్టా నేమిటి భగవంతుడా, నోట్లో నాలుకలేని మా నాయనకు" అంటూ రాగాలు మొదలు పెట్టింది మా అమ్మ

తమ నాన్న ఆ"డదాన్ని చెప్పుక్రింద తేలులా రాయాలి అలుసిస్తే నెత్తి కెక్కుతుంది" అంటూ అరిచారు.

కామేశ్వరి "మామయ్యా, పెద్దవారు, వయసు, మనసు పండిన మీ రనదగ్గ మాటలా అవి ! నేనేమి తప్పుపనులు చెయ్యలేదు. నోటికొచ్చినట్లు మాట్లాడి, మర్యాద పాడు చేసుకోకండి" అంది. ఆయన నోరెత్తలేక పోయారు. ఇల్లు అత్తాకోడళ్ళమధ్య కురుక్షేత్రంగా తయారైంది. ఈ పరిస్థితినుండి బయట పడాలంటే సర్వీస్ కమిషన్ పరీక్షకు కట్టటంతప్ప మార్గం తోచలేదు. తన తండ్రికది యిష్టంలేదు. పరీక్షఫీజుకు డబ్బు యివ్వలేదు. కామేశ్వరి తన పుట్టింటినుంచి తెచ్చుకున్న దాంట్లోంచి యిచ్చింది. ఆమె దృష్టిలో సమర్థుడనిపించుకోవాలనే పట్టుదలతో చదివి, పరీక్షలో నెగ్గి తాలూకా గుమస్తాగా స్థిరపడ్డాడు తను. ఇంటి పెత్తనమంతా కామేశ్వరి చేపట్టింది. ప్రతి పైసా జాగ్రత్తగా ఖర్చు పెట్టేది. కాఫీ టిఫిన్‌లు యింట్లోనే చేసేది. తనను సతాయించి డిపార్టుమెంటు టెస్టులు, అని అయ్యాక. యింటరు, బి. ఏ పూర్తి చేయించింది. పిల్లలు బయలుదేరారు. వాళ్ళను గట్టి కట్టుబాట్లతో పెంచేది. ప్రమోషన్ వచ్చి ఆఫీసరైనా తనకూ, కట్టుబాట్లే ! కాఫీ హోటళ్ళు, క్లబ్బులు నిషేధం, సినిమాలు నెలకు రెండుసార్లు మాత్రమే. తను పిల్లలు, ఈ కట్టుబాట్లు ఉల్లంఘించాలని, ఎలపెడితే, గొంతు చించుకుని గోలచేసి హడలగొట్టి అదుపులో పెట్టేది. అయినా, పిల్లలకు, తనకు లోటు లేకుండా రాత్రింబగళ్ళు శ్రమించి, అన్నీ అమర్చేది. పిల్లలు, అల్లరి, చిల్లరగా, తిరగకుండా, చదివిస్తూ అదుపులో పెట్టేది. తన మాట సాగనీయక, తమందర్నీ, పెంపుడు జంతువుల్లా, ఆడిస్తోందని, తనకు కామూ మీద కసిగా వుండేది ! రాక్షసి అని పిలిచే వాడతను. పిల్లలు వంత పాడేవారు. తనకు స్త్రీ వాంఛ చాలా ఎక్కువ. పురుళ్ళ సమయంలో ఒక నెల తప్ప ఆమె తన అవసరాన్నెప్పుడూ తీర్చేది. తమ నాలుగో సంతానమైన సుశీలంటే తనకు పంచ ప్రాణాలు. ఆ పిల్లను వదలి క్షణం కూడా ఉండలేక పోయేవాడు. తన ప్రాణంలో ప్రాణమైన సుశీల నాలుగేండ్ల చిన్నారి వయస్సులో 'ఫ్లూ' వచ్చి కన్ను మూసింది. తన మనస్సు శరీరం. నిర్జీవ మయ్యాయి. కన్నీరు కారుస్తూ పడివున్న తనను, కామూ తన హృదయానికి హత్తుకుని ఓదార్చింది. ఆమె స్పర్శతో తనలో మరల చైతన్యం చిగురించింది. ఆమె మనస్సులోని మమత, తనలోకి ప్రవహించి, మరల మనిషిని చేసింది. తనకు తెలియకుండానే తన శరీరం ఆమె పొందు కోరింది. ఆమె నిరాకరించలేదు అలసి నిద్రించిన తను అర్థరాత్రి లేచి చూచేసరికి, కామేశ్వరి కిటికీ దగ్గర, శూన్యంలోకి చూస్తూ, కన్నీరు కారుస్తోంది. తన బలహీనత నొవ్వుకోలేని తన మనస్సు. జరిగినదానికి, కామూ రాక్షసతత్వమే కారణమని రాజీపడి ఆమె నోదార్చకుండా అసహ్యించుకుంది. సుశీల మరణానికి

కన్నతల్లి హృదయం కాలిపోతున్నా. తనను మనిషిని చేయటానికే. ఆమె తనను కాదనలేక పోయిందని గ్రహించలేని మూర్ఖుడయ్యాడు తను! తను పదిరోజులు సెలవు పెడుతోంటే "ఇంట్లో ఏడుస్తూ కూర్చునే మగవాళ్ళంటే నా కసహ్యం. అంత ఏడవాలని వుంటే ఆఫీసులో కూర్చుని చేయండావని" అంటూ ఆఫీసుకు తరిమింది తనను. ఆమె హృదయం రాయి అని అసహ్యించుకున్నాడు తనప్పుడు. కాని యిప్పుడనిపిస్తోంది. యింట్లో వూరికే కూర్చుని పిచ్చి ఆలోచనలతో మనస్సు పాడుచేసుకోకుండా, ఆఫీసుపనిలో బాధ మర్చిపోయి మామూలు మనిషినయ్యేందుకే ఆ పని చేసిందని. కామూ చెప్పిందంతా నిజమే. ఒక ఆశయమూ లేక, మామూలు మనిషిగా జీవించదలచిన తననొక చైతన్యస్రవంతిగా తీర్చిదిద్ది. తను పిల్లలు సంఘంలో పరువు ప్రతిష్ఠలతో నిలబడటానికి అన్నివిధాలా పాటుపడింది కామేశ్వరి. తన పౌరుషం మీద దాడిచేసి. తన వ్యక్తిత్వానికి, హోదా అభివృద్ధికి దోహదం చేసింది, మరి తానెందుకామెను మెచ్చుకోడం లేదు! తరతరాలుగా తమలో జీర్ణించుకున్న పురుషుని అహంకారంమీద దెబ్బతీసిందామె! ఆడదంటే అడుగులకు మడుగులొత్తుతూ, పడివుండాలనే పాత అభిప్రాయం కాలదన్ని సంసారసారధ్యం చేపట్టడమే ఆమె తప్పు! అందుకే తనమనస్సు సరిపెట్టుకోలేక పోయాను. నిస్వార్థసేవతో కుటుంబాన్ని పైకిరావటానికి దోహదం చేసినందుకు, యిదా, తను. పిల్లలు. చూపవలసిన కృతజ్ఞత! భాస్కరరావు కళ్ళపొరలు విడిపోయాయి. హృదయపూర్వకంగా కన్నీరు కార్చసాగారాయన.

మురళి:—

తమను అమ్మ ఎంత కట్టుదిట్టాలతో పెంచింది. చిన్నప్పటినుంచి! చదువు ఆటలు, అన్నీ టైమ్ ప్రకారం జరిపించింది. తెల్లవారగట్ల నాలుగు గంటలకే లేచి చదవాలి! ఏడున్నరకు అరగంట వ్యాయామం తరువాత. చన్నీళ్ళస్నానం. కాఫీకి మనసుపడినా పాలేయిచ్చేది. ఎవళ్ళ బట్టలువాళ్ళు ఉతుక్కుని యిస్త్రీ చేసుకోవాలి, తమ తండ్రి ఆఫీసరైనా, తను తమ్ముళ్ళు సణుగుతుంటే "వెధవల్లారా ఎవరిపనివారు చేసుకోవడం తప్పా మీ నాన్న హోదామీద. డబ్బుమీద. ఆధారపడకుండా, స్వతంత్రంగా జీవించేశక్తి రావాలి మీకు. అప్పుడే మీరు జీవితంలో సుఖపడగలరు" అని తిట్టేది. చలిలో లేవమని. చదవమని. మొరాయిస్తే "చిన్నప్పుడు చదువుకోక సుఖపడితే. జీవితమంతా ఆ సుఖాన్ని తలుచుకుని ఏడవాలిరా! ఇప్పుడు కష్టపడితే నూరేండ్ల జీవితం సుఖంగా గడుస్తుంది. బుద్ధిబలంతోపాటు శరీరదార్ఢ్యం కూడా వుండాలి. జీవితంలోతగిలే ఎదురుదెబ్బలు తట్టుకోటానికి" అంటూ ఆంక్షలు అక్షరాలా అమలు జరిపేది స్కూల్ఫైనల్ చదివేటప్పుడు. తనొక స్కూల్ నాటకంలో హీరోగా వేస్తే అంతా మెచ్చుకున్నారు. తనకు పెద్ద నటుడు కావాలనే కాంక్ష కలిగింది. ఫలితంగా తనకు చదువుమీద శ్రద్ధ తగ్గింది. పసికట్టిన తనతల్లి "ఒరే చవటా! నటనలో రాణించటం కొద్దిమందికే సాధ్యం. వెర్రి వ్యామోహంలోపడి జీవితం నాశనం చేసుకోకు" అంటూ ఆంక్షలు అధికం చేసింది. తనకు తమ్ముళ్ళకు, ఏ పేపర్లోనైనా, ఫస్టుమార్కులు రాకపోతే "చాతకాని దద్దమ్మలు, పౌరుషంలేదు! మీ కన్నా ఆడవాళ్లనయం" అంటూ చీదరించేది. తాము పౌరుషం తెచ్చుకుని చదివేవాడు. తమ్ముడు శంకర్ డిటెక్టివ్ పుస్తకాల మోజులోను, రవి కథల పిచ్చిలోను పడి. చదువును అశ్రద్ధ చేస్తే, చీవాట్లేసి, తన్ని దారికి తెచ్చింది. తమంతా ఈ కట్టుబాట్లు సహించలేక, ఆమెను "రాక్షసి" బిరుదంతో సత్కరించి తృప్తిపడ్డారు. తను M. B ప్యాసవగానే ప్రయత్నించి తమ వూళ్ళోనే వుద్యోగం వేయించింది. తన భార్య శారద, వేరే వుండాలని ప్రయత్నించినా, తనామె ప్రక్కమొగ్గినా, పడనీయలేదు తనతల్లి. శారద ఎంత ఎదిరించినా, అంతకంటె పదిరెట్లు హంగామా చేసి దానినోరు మూయించింది, క్రమంగా శారద మూర్ఖ పట్టుదల సడలి, అర్థంచేసుకుని, సర్దుకుపోయే గృహిణి అయింది. ఇదంతా అమ్మ కృషి ఫలితంకాదా! మరెందుకు ఆమె అంటే తనకు కోపం. తమ నందరిని ముక్కుకు తాడు పోసి ఆడించిందనేగా! ఆమె చేసినది తమ మంచికే ఐనా, అధికారమంతా తన గుప్పిటలో వుంచుకోటం, తమ ద్వేషానికి దోహదంచేసింది. కాని ఆమె నిరంతర క్రమశిక్షణ, ఆంక్షలు లేకపోతే తమింత, వున్నతస్థితికి వచ్చేవారా! ఆమె నిజంగా దేవత ఆమెని ద్వేషించే తమంతా రాక్షసులు! మురళి కన్నులు పశ్చాత్తాపంతో వర్షింప సాగాయి.

రమ —

చుట్టుపక్కల కుటుంబాలలో ఆడపిల్లల నెట్లా ముద్దుగా చూచేవారని !గంటకోరకం — బట్టలు, ముస్తాబు, చదవమని ఆదరించేవారు కాదు, ఆడపిల్లలకు పెద్ద చదువులెందు కంటూ, ఇంట్లో పనులు ఎక్కువ చెప్పేవారుకాదు. అత్తారింటికి వెళ్ళిన తరువాత ఎట్లాగా తప్పదు, యిప్పుడైనా సుఖ డనీయండంటూ. వాళ్ళను చూస్తుంటే తమకు అమ్మమీదకసి పెరిగిపోయేది. నాన్న ఆఫీసరైనా తనకు చెల్లెళ్ళకు, సాదాబట్టలే కుట్టించేది. మంచి మంచిబట్టలు కావాలని ఏడిస్తే "పాపా! ఆడదాని మనస్సు, బట్ట, శరీరం, శుభ్రంగా వుండాలికాని, డాబు దర్జాలు అలవర్చుకోకూడదు. ఆ పిచ్చి తలకెక్కిన ఆడది తన సంసారాన్ని నరకం చేసుకుంటుంది" అనేది. తనూ చెల్లెళ్ళు మగపిల్లలతోపాటు తెల్లారగట్లలేచి చదవాలిసిందే. అన్నిపనులూ చెయ్యాలి! చుట్టుపక్కల ఆడపిల్లలు, సుఖపడుతుంటే మేమెందుకు యిట్లా కష్టపడాలని ఎదురుతిరిగితే" శరీరకష్టం తప్పనుకోవటం, అన్నిపనులు నేర్చుకొనకపోవటం, ముందు మీ సుఖజీవనానికి అడ్డంకులమ్మా. చదువుకుని విజ్ఞానాన్ని సంపాదించిన, ఆడదాని మనస్సు




దాంపత్యంలో సుఖంలేని అసమర్ధుడు... ఏం చేస్తాడూ!... నిరాశ చెంది తన భార్యను సుఖపెట్టలేక సిగ్గుతో కుమిలిపోతూ వుంటాడు. కారణం : కొందరు బాల్యంలోనే కామవాంఛకుగురియై మితిమీరి స్త్రీసాంగత్యం చేయడంచేత, మరికొందరు చెడుస్త్రీ సాహవాసంచేయడంచేత, ఇంకొందరు హస్తప్రయోగాలకు అలవాటుపడివీర్యాన్ని నష్టపరచుకొని. జననేంద్రియబలం సన్నగిల్లి వకృతలు ఏర్పడి, నపుంసకులై. దాంపత్యంలో సుఖం అనుభవించలేక దిగులుపడుతూ వుంటారు. అట్టివారి దాంపత్యంలో తిరిగి ఆనందం చిగురించడానికి పరిశుభ్ర రక్తం, వీర్యం, నరముల పటుత్వం, దేహదారుఢ్యం, ఉత్సాహం, చురుకుదనం. సమస్త అవయవములకు చక్కని బలం, ఉత్తాపనశక్తి అమిత భోగశక్తి అవసరం. ఇవన్నీ త్వరితగతిని సమకూర్చగల దివ్య ఔషధం కామరూపి లేహ్యం. స్వప్న స్ఖలనం, నరముల బలహీనత అలసట, నిరుత్సాహం శీఘ్రస్ఖలనం మొదలగునవి మాన్పి పుష్కలమైన రక్తాన్ని, వీర్యాన్ని శరీరకాంతిని, నరముల పటుత్వాన్నిచ్చి తిరిగి యౌవనులుగాచేసి అపారశక్తినివ్వగల అపూర్వ ఔషధం "కామరూపి లేహ్యం" వృద్ధులు, విద్యార్థులుకూడా వాడతగిన బలవర్ధక ఔషధం. వెల 1 మండలం రు. 10-00 పోస్టు ఖర్చులు రు. 3-00.



కాళ్ళలో ఆనెలకు : పాదములు నేలపై పెట్టి నడవలేక బాధపడుతూ. ఆనెలకు ఎన్నో మందులు వాడి నిరాశచెందిన వారు ఈ "బహిర్లేపన తైలం వాడిన ఆనెలు తిరిగి రాకుండా శాశ్వతంగా మాన్పును. వెల పోస్టు ఖర్చులతో సహా రు 6-25.

భరణి అండ్ కో., 7 బొమ్మలియర్ వీధి (47 బీటు) మద్రాసు-1

## రాక్షసి

వికసించి భర్తను అర్థం చేసుకుని, ఆదర్శ గృహిణిగా రూపొంది తన సంసారాన్ని నందన వనం చేసుకుంటుంది" అని చెప్పేది. ఇంటరు చదువుతున్నప్పుడు తనకు ప్రకాశంతో పరిచయ మైంది. ఎర్రగా చలాకీగా, సినిమా హీరో నాగేశ్వరరావులా వుండేవాడు, పుస్తకాలు మార్చుకోనటంతో ప్రారంభమైన, తమ పరిచయం, షికార్ల దాకా సాగింది. అంత అందగాడు తన స్నేహం కోరాడని స్నేహితురాండ్రు అసూయతో కుమిలిపోయేవారు. తనకెంతో గర్వంగావుండేది. గోదావరి ఒడ్డున షికారుచేస్తూ, ఖర్మంకాలి అమ్మ కంటపడ్డాము. బెదురుతూ యింట్లో అడుగు పెట్టిన తనతో ఈ తిరుగుళ్ళేమిటని, నిలదీసింది అమ్మ. తనుమొండిగా "ప్రకాశ్! అందంగా వుంటాడు మేము ప్రేమించుకున్నాము" అంది.

"చూడు పాపా! వయస్సు, మనస్సు పూర్తిగా వికసించని,నివు, అబ్బాయి అందానికి ఆకర్షించబడి, జీవితాన్ని జారవిడుచుకుంటున్నావు. మగవాని అందంగురించి ఆరుమాసాల తరువాత ఆలోచించదు ఏ ఆడదీ! ఆడదాన్ని జీవితాంతం అలరించి సుఖపెట్టేది, మగవాని మంచితనం, నిర్మలమైన మనస్సు. ఆర్థిక స్థితికూడా సంసార జీవితానికి గట్టి పునాది. ఇవన్నీ అమర్చినపుడే స్త్రీ జీవితం ఆనందమయ మవుతుంది, జీవితంలో స్థిరపడని ప్రకాశ్‌ను ప్రేమంటూ పెండ్లి చేసుకుంటే జీవితాంతం. చేజిక్కని సుఖాలకు, చింతిస్తూ కాలం గడపాలి. ఈ ప్రేమపెండ్లికి దారితీయకపోతే కళంకినిగా కన్నీరు కారుస్తూ, చుక్కానిలేని జీవితం గడపాలి. నా మాటవిని చదువు పూర్తయేదాకా ఈ తిరుగుళ్లు మానేయి" అంది అమ్మ.

తను మొండికేసింది. మరునాడు అన్నయ్యను పంపి ప్రకాశ్‌ను. యింటికి పిలిచి,

"అబ్బాయీ, మీ సరదా తిరుగుళ్ళకి అర్థమేమిటి" అని అన్నది అమ్మ "మాయిద్దరికీ స్నేహముండి అన్నాడు" ప్రకాశ్.

"చాలా సంతోషం నాయనా! సంబంధాలు వెతికి పెద్ద కట్నాలు యిచ్చి పెండ్లి చేసే బాధ నుండి తప్పించారు మీరు. మీనాన్నగారి అడ్రస్ చెప్పు పెండ్లి ఖాయం చేస్తాను" అంది అమ్మ.

ప్రకాశ్ నోట మాట రాలేదు. గుడ్లు మిటకరించి చూస్తూ కానేవటికి "క్షమించండి, పెండ్లి ఆలోచన లేదు నాకు యిప్పుడే. మా నాన్న నన్ను కష్టపడి చదివిస్తున్నాడు. చదువు పూర్తి చేసి. ఉద్యోగం చేస్తూ, మా వాళ్లను ఆదుకున్న తరువాతనే ఆలోచించాలి పెండ్లి విషయం" అన్నాడు.

"అంటే ఆడపిల్ల జీవితంతో సరదాగా ఆడుకుని, నీ దారిన నీవు పోతా వన్నమాట! అన్ని బాధ్యతలున్న వాడివి. బుద్ధిగా చదువుకోక నీ అందాన్ని ఎరచేసి కన్నెపిల్లల కోసం, గేలం వేయటమా, నీవు నేర్చుకునే చదువు! ఇక నుండి మా రమతో స్నేహమంటూ తిరిగే వంటే జాగ్రత్త! ప్రిన్సిపాల్‌కు రిపోర్టు చేస్తాను." అంటూ మండిపడింది అమ్మ. ప్రకాశ్ పిల్లిలా మారిపోయాడు. హృదయం బ్రద్దలై కన్నీరు కార్చే తనను, ప్రేమగా పొదివి పట్టుకుని "పిచ్చితల్లి. యిటువంటి స్థిరంలేని కుర్రాళ్లను నమ్ముకుంటే బ్రతుకు బజారు పాలౌతుందమ్మా! ముందే మేలుకోవటం మంచిదైంది. మనస్సు గట్టిచేసుకుని చదువు పూర్తిచెయ్యి. నీకు తగిన సంబంధం తెచ్చే పూచీ నాది" అంది అమ్మ. అట్లాగే తన చెల్లెలు సినిమా పిచ్చి కూడా వదలగొట్టింది. తమకు మంచి సంబంధాలు చేసి తమ జీవితం, సుఖమయం చేసినా. తమ కన్నె మనసుల కలలు కాలరాచిందనే బాధ మనస్సులో పాతుకుపోయింది. నిజంగా అమ్మ ఎంత ప్రేమమయి! ఆమెనా తా మసహ్యించుకోటం. రమ వెక్కుతూ ఏడవ సాగింది.

శారద——

డాక్టరు భర్తగా దొరికాడని తానెంతో పొంగిపోయింది. కావలసినంత హోదా డబ్బు, నౌకరులతో కాలు క్రింద పెట్టకుండా బ్రతకవచ్చని కలలు కంది! తను ఆట్టే చదువుకోలేదు. అసలు తన చదువును గురించి తన యింట్లో ఎవరూ పట్టించుకునేవారు కాదు. అమ్మా, నాన్న యింట్లో పోట్లాడని రోజు వుండేది కాదు. తమ అమ్మ, తనపట్టు. ఏడ్చి, వుపవాసాలు చేసి. ఫిట్లు వచ్చి పడిపోయి సాధించేది, ఆమె కాపురానికి వస్తూనే అత్తగారిని వేరే పెట్టింది. మధ్య మధ్య అత్తా కోడళ్ళ దెబ్బలాటలు, కొట్టుకోవటం దాకా వచ్చేది. తనా తత్వాన్ని చూచి నేర్చుకుంది. తను కాపరానికి వచ్చేక, తన భర్తకు వుద్యోగం, తామున్న వూళ్ళోనే వేయించింది. అత్తగారు. తాము వేరుగా వుండాలనే, పుబలాటము సాగనీయలేదు. పైగా వచ్చినట్లు చాకిరీ చెయ్యాలిసొచ్చేది! కలలు కరిగిపోగా కోపం. చిరాకు చోటు చేసుకున్నాయి తనలో. ప్రతిదానికి ఎదిరించేది అత్తగారిని, ఆమె అంతకన్న ఎక్కువగా అరిచి తననోరు మూయించేది. తన భర్తకేకాక, యింట్లో ఎవరికీ ఆమెమాట కాదనే దమ్ములులేవు. ఇది మార్గంకాదని, తను మూర్ఛ వచ్చినట్లు, గుండె దడవచ్చినట్లు నటించేది. పని చెయ్యమంటే! తనభర్త ఆదుర్దాపడి యింజక్షన్ యివ్వబోతే అత్తగారు "అది కాదురా సరైన మందు. తీసికెళ్ళి పుట్టింటి దగ్గర దిగబెట్టిరా పూర్తిగా తగ్గి, సజావుగా సంసారం చేసుకునే మార్పు వచ్చాక తీసుకువద్దూగాని" అంటూ రిక్షాకోసం పంపింది. తనకు గాబరా పుట్టి లేచి కూర్చుని తగ్గిపోయింది వెళ్ళనంటూ ఏడ్చింది, "వెర్రివేషాలు మాని బుద్ధిగా మసలుకోమని" హెచ్చరించింది. తన్ను అత్తగారు. అవమానంతో తనమనస్సు వుడికిపోయింది. ఆమెను అందరిలో అల్లరిచేస్తేగాని తనను వేరుగా వుండనివ్వదని, తను, అత్తగారు ఒకనాడు మాటిమాటికి ఎదిరిస్తుంటే విసిగిపోయి" యిటువంటి మూర్ఖురాలిని తెచ్చుకున్నానేమిటి. కొంతకాలం పుట్టింట్లోవుంచేస్తేగాని ఈరోగం కుదరదు" అంటూ అరిచింది. తను వీధి మధ్యకు పరిగెత్తి ఏడుస్తూ "ఈరాక్షసి అత్తగారు ఎక్కడ దొరికింది నాకు!నాకాపరంలో నిప్పులు పోస్తుంది, నన్ను పుట్టింటికి తరిమి ఆయనకు మళ్ళీ పెళ్ళి చెయాలని చూస్తోంది దేవుడా" అంటూ ఏడ్చింది నలుగురూ పోగయ్యారు. అత్తగారికి పట్టరాని ఆవేశం వచ్చింది. ఆ అవమానంతో గబగబ చెక్కుడ్రాని తీసుకువచ్చి "ఇదిగో మీవాళ్ళిచ్చిన బోడికట్నం డబ్బు, పైగా రెండువేలు ఎక్కువ యిస్తున్నాను! ఈయాభై రూపాయలు ఖర్చులకు తీసుకుని, మీ వాళ్ళింటికి పో! నీ దిక్కున్నచోట చెప్పుకో! మరల ఈ యింట్లో అడుగుపెట్టవద్దు" అంటూ మా వారికేసి తిరిగి "నీకూ యిష్టమైతే దాంతో పో"అంటూ లోపలికి వెళ్ళిపోయారామె. తనభర్త ఆమె వెనుకే నడిచారు తనకు మతిపోయింది, ఇదేమి భగవంతుడా కథ అడ్డంతిరిగి తన కాపరమే పోతుందని! తన్నాదరించేటంతటి సహృదయులు కాదు తనవాళ్ళు. లోపలికి వెళ్ళి ఏడుస్తూ తనభర్తకాళ్ళుపట్టుకుందితను.

"మా అమ్మను యింత అవమానం చేస్తావా పో" అంటూ వెళ్ళిపోయారాయన. అత్తయ్య అనుగ్రహిస్తే తప్ప తన కాపురం గంగలోకలిసి పోయినట్టే! ఇక దారిలేక క్షమించమంటూ ఆమె కాళ్ళమీద పడింది కన్నీరు కారుస్తూ. ఇకఎప్పుడూ ఆమెమాట జవదాటనని. ప్రమాణాలు చేసిందితను. ఆమె"శారదా! యింత మూర్ఖురాలివనుకోలేదు, ప్రతిష్ఠకల పండంటి సంసారాన్ని, బజారుకీడ్చి అవమానంపాలు చేస్తావా! నిజంగా నిన్ను. క్షమించకూడదు. కానీ నాకూ ఆడపిల్లలున్నారు. ఒక ఆడపిల్లవుసురు ఈ కుటుంబానికి తగలకూడదు. లే! బుద్ధిగా సంసారం చేసుకుంటూ కాస్త ఆలోచించటం నేర్చుకో: యికముందు యిటువంటి పరిస్థితి రాకూడదు" అంది. క్రమంగా బాధ్యత తెలుసుకుని పక్కా గృహిణి అయింది. తనుఇంత జరిగినా, తన్నామె భేదంగా చూడలేదు. తోడికోడళ్ళిద్దరూ, డబ్బున్న కుటుంబాలనుండివచ్చి, దర్జాగా చీరలు నగలు తెచ్చుకుంటే, తనకు వాళ్ళతో సమానంగా కొని చిన్నచూపు చూడకుండా ఆదరించిందిఅత్తగారు, ఆమెను అర్థం చేసుకోలేదు తను అవివేకంతో అనుకుంటూ వాపోయింది శారద.

కామేశ్వరమ్మగారికి మత్తువదలి స్పృహ వచ్చింది అంతా చుట్టూచేరారు. ఆమె హృదయం మీద తలవాల్చి కన్నీళ్ళు కారుస్తూ భాస్కరరావుగారు "కామూ నన్ను క్షమించు, దురహంకారంతో దేవతలాంటి నిన్ను, రాక్షసి అంటూ చీదరించుకున్నాను'' అంటూ అలమటించారు. కొడుకులు, కూతుళ్ళు, కోడళ్ళు చేతులు, జోడించి, క్షమించమంటూ కన్నీరు కార్చారు. తృప్తిగా ఆఖరిశ్వాస వదిలారామె. ★